"ప్రాణ, విత్త, మానభంగమందు" బొంకవచ్చనన్నారు. అబద్ధమూ, నిజమూ రెండూ చెప్పడానికి వీల్లేని సందర్భాలూ వుంటాయి. అలాంటప్పుడు యేం చెయ్యాలి?

# నిజం చెప్పకు

**వి. ఎస్. చెన్నూరి**

**"గొడుగు కొత్తదిలాగుంది! ఎప్పుడు కొన్నావేమిటి?" ఆఫీసులో అడుగెట్టగానే యెదురొచ్చిన ప్రకాశం ప్రశ్నించాడు.**

**"నిన్న!" అంటూ తలొంచుకుని గొడుగుకేసే చూస్తూ నా సీటుకేసి నడిచాను.**

పక్క సీటు రామనాథం దృష్టి యెప్పుడు పడిందో నా గొడుగుమీద, అమాంతం కుర్చీలోంచి లేచి, గద్దలా తన్నుకు పొయ్యాడు నా చేతిలోంచి. క్షణంలో గొడుగుచుట్టూ జనం గుంపు గూడారు.

నేను సంతకంపెట్టి వొచ్చేలోగా వాళ్ళు నా గొడుగుని శల్యపరీక్ష చేస్తున్నారు. నా గొడుగు వాళ్ళ చేతుల్లో నానా యాతనా పడుతోంది. దాని యాతన చూస్తోంటే నా ప్రాణం విలవిల కొట్టుకుంటోంది.

"బావుంది! చాలా బావుంది! ఎంత కొన్నావేమిటి?" బాణం విసిరాడు భానుమూర్తిగాడు.

నా గుండె ఝల్లుమంది. దడ ప్రారంభమైంది. చమటలు పోస్తున్నయ్ శరీరమంతా.

ఏం చెప్పను? నిజం చెప్పి నలుగుర్లో నవ్వులపాలు గానా? అబద్ధమాడి ఆత్మవంచన చేసుకోనా?—

నేను పెదవి విప్పలేదు! ఛస్తే విప్పదలచుకోలేరు!

"ఎంతేమిటి?— పాతిక!— మొన్న కొనుక్కురాలా సీతాపతి? అచ్చం ఇలాంటిదే! ఇదే బ్రాండు!" ఆనందరావు అందుకున్నాడు.

ఆపదలో ఆదుకున్నందుకు ఆనందరావుగాడ్ని మనసులోనే అభినందించాను. ఆ ప్రసక్తి అంతటితో ఆగుతుందన్న ఆశ కొద్దీ తృప్తిగా వూపిరి పీల్చుకున్నాను. కాని నా ఆశ నిరాశకావడానికి ఎంతో సేపు పట్టలేదు. అప్పుడే ఆఫీసులో అడుగెట్టిన అంజిగాడు పానకంలో పుడకలా దాపురించాడు.


"సీతాపతి లాంటి చవట షాపింగుకి వెళితే గొడుగు వెల పాతికేమిటి, ముప్ఫయ్ అయినా ఆశ్చర్యపోనక్కర్లేదు!" హేళనగా ఓ నవ్వు నవ్వి. "షాపింగ్ అంటే సామాన్యంకాదు బ్రదర్. దానికి చాకచక్యం కావాలి!" గర్వంగా పోజుపెట్టి కాలర్ సర్దుకున్నాడు అంజిగాడు.

వాడితో ఆర్గ్యుమెంటులోకి దిగడం ఎవరికీ యిష్టంలేదు. అందుచేత ఎవరూ వాడికి రెస్పాన్స్ యివ్వలేదు.

"ఇంతకీ దీని వెల ఎంతో చెప్పావు కావు" భానుమూర్తిగాడు మళ్ళీ విసిరాడు బాణం.

చంపేశాడు! వెల చెప్పందే వొదిలేలా లేడు. జిడ్డు వెధవ! ఎలా తప్పించుకోవడం?

ఆలోచిస్తున్నాను. ఈ ఆపదలోంచి ఎలా బైటపడాలో మార్గం అన్వేషిస్తు



న్నాను. అడ్డొచ్చిన అంజిగాడ్ని కసికొద్దీ తిట్టుకుంటున్నాను.

"చెప్పవేంరా? ఎంతక్కొన్నావేమిటి?" భానుమూర్తిగాడి బాణం రామనాధం గాడందుకున్నాడు.

ఇప్పుడెలా? ఏం చెయ్యను?—

గుండెల్లో గుర్రాలు దౌడు తీస్తున్నయ్.

"ఇరవై యొకటి! నేనే కొనిపించాను. ఇంతకంటే తక్కువ ధరకు ఎవడైనా కొనగలిగితే నా మీసం తీయించేస్తాను" అంజిగాడే అందుకొన్నాడు.

"హమ్మయ్య!" అనుకున్నాను. గుండెలు కుదుటబడ్డయ్.

"ఇరవయ్యొకటా ? ఓన్లీ ట్వంటీవన్—ఎక్కడ?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు ప్రకాశం.

"సుల్తాన్ బజార్లో!" కాలర్ సర్దుకున్నాడు అంజిగాడు.

"సీతాపతి కొన్నది యిక్కడే! ఎం. జీ. రోడ్లో! సుల్తాన్ బజార్ వెళ్ళి రావడానికి యేమవుతుంది? అంతా ఆ లెక్క కాలా?" అన్నాడు ఆనందరావు సీతాపతిని వెనకేసుకు వస్తూ.

"ఏడిసినట్టేవుంది ఆర్గ్యుమెంటు! సుల్తాన్ బజార్ వెళ్ళి, రావడానికి బస్ ఫేర్ రూపాయి. అక్కడ కాఫీగట్రా తాగితే మరో రూపాయి. అప్పటికీ రెండు రూపాయలు ఆదా కాలా?" అన్నాడు అంజిగాడు.

ఆనందరావు మాట్లాడలేదు.

"అసలు నేను వాడికి ముందే చెప్పాను, నాతో సుల్తాన్ బజార్రారా కొనిపెడతానని. వింటేనా, సీతాపతిగాడు! గొడుక్కోసం అంత దూరం వెళ్ళాలా, నాల్రూపాయలు అటో, ఇటో యిక్కడే కొంటేపోలా. అన్నాడు పేద్ద షావుకార్లా! చేతగానితనం వొప్పేసుకోవడానికి నామోషీ చవటకి!" అంజిగాడు మరో మారు కాలర్ సర్దుకుని మళ్ళీ చెప్పసాగాడు. "మీకు తెలీదు. బార్గెయినింగ్ అనేది ఓ ఆర్టు! ప్రతివాడికీ యీ ఆర్టులో అంతో, యింతో ప్రవేశం వుండితీరాలి! ఈ ఆర్టులో ప్రవేశంలేనివాడు జీవితంలో అడుగడుక్కీ ధోకా తింటూనే వుంటాడు. చెప్పిన ధరపెట్టి కొనుక్కురావడం గొప్పతనం కాదు—చేతగానితనం!"

సెక్షన్ ఆఫీసర్ అడుగుపెట్టడంతో అంజిగాడి వాక్ప్రవాహానికి అంతరాయం కలిగింది. పిల్లిని చూసిన ఎలకల్లా ఎవరి సీట్లకు వాళ్ళు జారుకున్నారు. నేను నా కుర్చీలో కూలబడి ఫైలు తెరిచాను. కాని బుర్రంతా అంజిగాడి ఉపన్యాసం మీదే పని చేస్తోంది.

అంజిగాడన్నట్టు బేరమాడ్డం కళే కావచ్చు! ఈ కళలో ప్రవేశం లేనివాడు జీవితంలో అడుగడుక్కీ ధోకా తినడం నిజమేకావచ్చు! అందుకనే కాబోలు వెయ్యిరూపాయల జీతగాడు సైతం పావలా పైసలకోసం రిక్షావాడితో సిగ్గువిడిచి పేచీ పెట్టుకుంటాడు నడివీధిలో. ఎంతసేపూ ఎదటవాడికి టోపీ వెయ్యడానికే ప్రయత్నిస్తాడు ప్రతివాడూ. టోపీ వేయించుకున్నవాడు సంఘం దృష్టిలో చవట! ఎందుకూ కొరగాని దద్దమ్మ! వాడిమీద సానుభూతి చూపడానికి బదులు ఎద్దేవా చేస్తుందీ సంఘం! టోపీ వేసినవాడు గొప్పవాడు! వాడికి బ్రహ్మరథం పడుతుందీ నాగరిక ప్రపంచం!

అంటే మోసానికున్న గౌరవం న్యాయానికి లేదన్నమాట!

అబద్ధానికున్న విలువ నిజానికి లేదన్నమాట!

అసలు కళంటే ఏమిటి? మోసం. దగా. వంచన.

లేనిద్దాన్ని వున్నట్టు భ్రమింపచెయ్యడం కళ!

అబద్ధాన్ని అందలం ఎక్కించడం కళ!

కబుర్లు చెప్పి మోసగిస్తాడు కథకుడు. గీతలుగీసి భ్రమింపజేస్తాడు చిత్రకారుడు! వేషం వేసి దగా చేస్తాడు నటుడు. మాటలు చెప్పి వంచిస్తాడు రాజకీయవేత్త!

అవునంటారా?—కాదంటారా?—

అంటే మోసానికి మొక్కేవాళ్ళు, అబద్ధాన్ని అందల మెక్కించేవాళ్ళు కళాకారులన్న మాట!

ఈ కళాకారులకున్న విలువ మరెవ్వరికీ లేదీ సంఘంలో. అంబారీనెక్కి వూరేగేదీ, గద్దెనెక్కి పాలించేదీ ఈ కళాకారులే. ఇది కళాకారుల కాలం. ఈ



కాలంలో పూజింపబడేది ఒక్క కళాకారుడు మాత్రమే!

కాలం మారింది!

విలువలు మారాయి!

"అబద్ధమాడకు" అన్నారు నిన్నటి పెద్దలు!

"నిజం చెప్పకు" అంటారేమో రేపటి నాయకులు!

ఇది సంధికాలం. నిన్నటికీ, రేపటికీ మధ్యకాలం. ఈ సంధికాలంలో కాస్త వెనకబడ్డవాన్ని నేను. నిన్నటి వాసనలు పూర్తిగా నశించనివాన్ని. రేపటి అభ్యుదయం ఆటే వంటబట్టనివాడ్ని. అందుకనే అబద్ధం చెప్పి ఆత్మవంచన చేసుకోలేక పొయ్యాను. నిజం చెప్పి నలుగుర్లో నవ్వులపాలు కాలేకపొయ్యాను.

ఇంతకీ ఏమిటా నిజం?- అంటారేమో!

అయితే నా 'గొడుగుకథ' వినిపిస్తా వినండి!


అబద్ధానికున్న విలువ నిజానికుందో, లేదో మీరే నిర్ణయించండి!

వర్షంలో చిత్తుగా తడిసినప్పుడల్లా అనుకునేవాన్ని ఎలాగయినా ఓ గొడుగు కొనుక్కోవాలని. పైసా చేతిలో వున్నప్పుడు మాత్రం ఆ ధ్యాసే వచ్చేది కాదు. అందుచేత గొడుగు కొనుక్కోవాలన్న కోరిక తీరని కోరికగానే వుండిపోయింది.

మొన్న సీతాపతి ఓ కొత్త గొడుగు కొని పట్టుకొచ్చాడు ఆఫీసుకి. దాన్ని చూసిన తరువాత నా కోరిక మళ్ళీ తలెత్తింది. అదృష్టవశాత్తు సమయానికి జేబులో పైసలు కూడా వున్నాయ్. వచ్చేది వర్షాకాలం. అందుచేత ఎలాగయినా గొడుగు కొనెయ్యాలన్న నిశ్చయానికి వచ్చాను.

సీతాపతిని కలుసుకుని, అతగాడి గొడుగు నోమాటు క్షుణ్ణంగా పరిశీలించి అతడు ఎక్కడ కొన్నదీ, ఎంతకు కొన్నదీ, వగైరా వివరాలన్నీ అడిగి


దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!



హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మ వ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును.
వరిబీజము (బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ. రండి.

డా॥ దేవర, ఫోన్ 551, మార్వాడి గుడి వద్ద, తెనాలి.

బ్రాంచి : 5/1. బ్రాడీపేట, గుంటూరు-2




తెలుసుకున్నాను. నేను సీతాపతిని కలుసుకున్నది ఎలా కనిపెట్టాడో, ఏమో అంజిగాడు.

'ఏమిట్రా వాడిని కన్సల్ట్ చేస్తున్నావ్?' అంటూ వచ్చి నా పక్కన చతికిలబడ్డాడు. నా చిరకాల వాంఛను వాడికి చెప్పక తప్పింది కాదు.

"కన్సల్ట్ చెయ్యడానికి సీతాపతికంటే చవట దొరకలేదా నీకు?" అంజిగాడు హేళనగా నవ్వి "వాడుకొన్న గొడుగు లాంటిదే నెలరోజుల క్రితం నా ఫ్రెండుకి కొనిపెట్టాను సుల్తాన్ బజార్లో. ఇరవై రూపాయలే. ఇప్పుడు మహా పెరిగివుంటే మరో రూపాయి పెరిగి వుండొచ్చు! సాయంత్రం నాతోరా సుల్తాన్ బజారుకి, కొనిపెడతాను" అన్నాడు.

సరుకు నాణ్యం చూడ్డంలోనూ, బేరమాడ్డంలోనూ అంజిగాడికి మంచి పేరుంది. నాణ్యమైన సరుకు సరసంగా దొరుకుతుందనేసరికి ప్రలోభం తన్నుకొచ్చింది. పావలా పైసలు కలిసొస్తుందనే సరికి పదిమైళ్ళు వెళ్ళడాని కయినా తయారవతాడు మానవుడు!

"అయితే సాయంత్రం వెళదామా?" అన్నాను ఆశగా.

అంజిగాడు సరేనన్నాడు. ఆ సాయంత్రం ఆఫీసు వదలగానే బయలుదేరి సుల్తాన్ బజారు చేరుకున్నాం. నాణ్యమైన సరుకుకోసం నాలుగైదు షాపులు తిరగవలసివచ్చింది. చివరికి ఓ షాపులో అచ్చం సీతాపతి కొన్న గొడుగులాంటిదే యిరవై రూపాయలకు కొనుక్కొని బైట పడ్డాం. షాపులోంచి మేము బైట పడేసరికి తొమ్మిది దాటింది. కడుపులో ఎలకలు గోల పెడుతున్నాయ్.

"కాఫీ తాగివద్దాం పదరా!" అన్నాను అంజిగాడితో.

"లాభం లేదు బ్రదర్. తొమ్మిది దాటింది టైము. మా శ్రీమతి నీళ్ళు, నిప్పులూ లేకుండా నాకోసం ఎదురు చూస్తూ కూచుంటుంది. నేను వెంటనే వెళ్ళిపోవాలి! ఇక్కడేగా యిల్లు? రేపు కలుద్దాంలే! వస్తా! బైబై!" అంటూ క్షణం కూడా ఆగకుండా పలాయనం చిత్తగించాడు.

వాడికేం పది నిమిషాల్లో ఇల్లు చేరుకుంటాడు. సుష్టుగా భోజనం చేసి సిగరెట్టు వెలిగించుకుని మంచ మెక్కుతాడు. నేను మల్కాజ్‌గిరీ వెళ్ళాలి! కనీసం రెండు గంటల సేపయినా పడుతుంది ఇల్లు చేరుకోవడానికి. కోటీ నుంచి బస్సు పట్టుకుని సికింద్రాబాద్ చేరాలి. సికింద్రాబాద్ నుంచి మరో బస్సు పట్టుకుంటే తప్ప ఇల్లు చెరడానికి వీల్లేదు. కడుపులో ఏదయినా పడెయ్యకపోతే ఆత్మారాముడు వూరుకోడు. అందుచేత నా ప్రమేయం లేకుండానే హోటలు కేసి నడిచాయి కాళ్లు.

అది అసలే పెద్ద హోటలు. పైగా బిజీ టైము. సీటు దొరకడానికే పావుగంట పట్టింది. ఆర్డర్ చేసిన ఐటమ్స్ పట్టుకు రావడానికి సర్వరు మరో పావుగంట తినేశాడు. నేను తినడం పూర్తిచేసి, కాఫీతాగి రిస్టు వాచీ చూసుకునే సరికి పది కావస్తోంది. గుండెల్లో దడ ప్రారంభమైంది. ఆ సమయంలో బస్సు దొరకడం కష్టం. జనంతో కుస్తీ పడితేతప్ప ఫుట్‌బోర్డు మీదకూడా చోటుదొరకదు. వెంటనే బస్టాండు చేరుకోవాలి! కాని సర్వరు ఐపు లేడు. ఎంత సేపని అతనికోసం యెదురుచూడను! వెంటబడితేతప్ప బిల్లు చేతికొచ్చిందికాదు. ఎలాగయితేనేం కౌంటర్‌లో బిల్లు చెల్లించి కోటీకేసి పరుగు లంకించుకున్నాను.

నేను బస్టాండు చేరుకునేసరికి నా కళ్ళముందే వెళ్ళిపోయిందో బస్సు - నిండు చూలాలికి మల్లే. అక్కడ మూగిన జనంకేసి చూసేసరికి నాగుండెలుఆగిపోయాయి. అలాంటి బస్సులు మరో నాలుగయినా చాలవు ఆ జనాన్ని క్లియర్ చెయ్యడానికి. తరువాతి బస్సు మరో అరగంటకి గాని బయలుదేరదు. అప్పుడయినా సీటు దొరుకుతుందన్న గ్యారంటీ లేదు. ఈ బస్సుల కోసం ఎదురుచూస్తూ కూచుంటే సికింద్రాబాద్‌లో మల్కాజ్‌గిరీ వెళ్ళే బస్సు దొరక్కపోవచ్చు. లాస్ట్ బస్సు వెళ్ళిపోతే ఆటోల వెంబడి పడాలి. రానూ పోనూ కిరాయి ముట్టచెబుతానంటే తప్ప ఆవేళ

ప్పుడు మల్కాజ్‌గిరికి ఎవడూ రాడు. అందుచేత ఇప్పుడే ఏదైనా ఆటో చూసుకుంటే కనీసం మల్కాజ్‌గిరి వెళ్ళే బస్సునైనా పట్టుకోవచ్చు సికింద్రాబాద్‌లో.

ఆలోచన రావడం ఆలస్యం ఆటో వేట ప్రారంభించాను. ఆ సమయంలో అందరికీ గిరాకే. ఎవన్నడిగినా సికింద్రాబాద్‌కి రానంటున్నాడు. నా కళ్ళముందే నాలుగైదు ఆటోలు వెళ్ళిపోయినయ్.

మనం వెళ్ళవలసిన చోటుకి తప్ప మరెక్కడికైనా వస్తానంటాడు ఆటోవాడు. ఆ సమయంలో అదేదో "ఫర్బిడన్ ఏరియా" అయినట్టు! మన అవసరంకొద్దీ రెండో మూడో అదనంగా ముట్టచెబుతానంటే చచ్చినట్టు వస్తాడు. అదో రకమైన 'ట్రేడ్ ట్రిక్'. దీన్నే అంటాడు కాబోలు మా అంజిగాడు 'ఆర్ట్' అని.

ఎలాగయితేనేం ఓ ఆటోని పట్టుకోగలిగాను. మీటర్‌మీద రెండురూపాయలు అదనంగా ముట్టచెబుతానని. ఆటో బయలుదేరింది. తారురోడ్డు మీద రాకెట్లా దూసుకుపోతూంటె, ఎదురొచ్చే వాహనాలు కంటబడ్డప్పుడల్లా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని, కళ్ళు గట్టిగా మూసుకుని నిమిషాలు లెక్కబెడుతున్నాను. వీరాభిమన్యుడు పద్మవ్యూహంలోకిజొరబడినట్లు, పులుస్తాపులూ కామాలూ లేకుండా, బస్సుల లైట్లకళ్ళలోంచి. లారీల హారన్ల హోరు నుంచీ, సైకిళ్ళ గుండెల్లోంచీ దూసుకుపోతోంది ఆటో. అవసరమొచ్చినప్పుడల్లా అష్టవంకర్లు తిరుగుతూ, గాల్లోకి ఎగురుతూ, సర్కస్ ఫీట్లు చేస్తూ ముందుకు సాగుతోంది.

నారాయణగూడా చౌరస్తాదాటి, చిక్కడ్‌పల్లి చేరుకునేసరికి చిన్న కుదుపుతో ఆగిపోయింది ఆటో. ట్రాఫిక్ జాం అయింది కాబోలు. ముందు వెళుతున్న కార్లూ, ఆటోలూ. స్కూటర్‌లూ అన్నీ ఆగిపోయినయ్.

"చచ్చాం ఫో!" బరువుగా నిట్టూర్చి పక్కకి తిరిగాను.

ఎదురుగుండా షాపులో రకరకాల గొడుగులు వ్రేలాడుతున్నయ్. తక్షణం నా గొడుగు గుర్తుకొచ్చింది. గుండెలాగిపోయినయ్!

ఇంకెక్కడి గొడుగు! ఇల్లు చేరాలన్న ఆదుర్దాలో హోటల్లోనే విడిచిపెట్టాను! తిరిగి వెళ్ళినా దొరుకుతుందన్న గ్యారంటీ లేదు! అదృష్టవంతుడెవడో చేతబట్టుకుపోయి వుంటాడు. అసలీపాటికి హోటలు కూడా కట్టేసి వుంటారు! గుండె రాయి చేసుకున్నాను.

"ఒక్కో పుణ్యానికి ఎంత శ్రమపడవలసి




వచ్చింది!" బరువుగా నిట్టూర్చాను.

రేపు గొడుగు లేకుండా ఆఫీసుకి వెళితే అంజిగాడు గొడుగేమైందని అడుగుతాడు. జరిగిందంతా చెప్పవలసి వస్తుంది. చేతి పైసా వొదిలించుకున్నది కాకుండా నలుగుర్లోనూ నవ్వులపాలు కావలసి వస్తుంది. ఎలాగూ షాపుముందే వున్నాం కనుక, మరో గొడుగు కొనిపట్టుకెళితే పుణ్యమూ, పురుషార్థమూ కలిసొస్తాయి అనుకున్నాను.

"డ్రైవర్! బండిని కాస్త షాపుముందుకి తీసుకెళ్ళు! షాపులో కాస్త పనుంది" అన్నాను.

ఆటో షాపుముందు ఆగింది. నేను ఆటో దిగి షాపులోకి నడిచాను. షాపు కట్టేసే సన్నాహంలో వున్నారు కాబోలు పనికుర్రాళ్ళు బైట వ్రేలాడుతోన్న గొడుగుల్ని జమ చేస్తున్నారు. ఓ కుర్రాడిచేతిలో అచ్చం యింతకుముందు నేను పోగొట్టుకున్న గొడుగు లాంటిదే కనిపించింది. అమాంతం దాన్ని లంకించుకుని "ఎంత?" అన్నాను. పక్కనే వున్న సేల్స్‌మేన్ పరుగెత్తుకునివచ్చి, "పాతిక సార్"అన్నాడు. గొడుగునితెరిచి ఓసారి పరీక్షించి, "ఇచ్చే ధర చెప్పు!" అన్నాను, పేద్ద బేరగాడిలా.

"ఫిక్సెడ్ రేటు సార్! కొట్టు కట్టేస్తున్నాము! చివరి బేరం ఓ రూపాయి తక్కువ చేసుకుని యివ్వండి!" అన్నాడు.

మారు మాట్లాడకుండా జేబులోంచి ఇరవైనాల్గు రూపాయలూ తీసి వాడి చేత బెట్టి గొడుగు పట్టుకుని తిన్నగా ఆటోలోకి చేరుకున్నాను. ఈ దఫా యీ గొడుగుని ఎక్కడా వదిలిపోకూడదని జాగ్రత్తగా పట్టుకున్నాను.

మా ముందున్న వాహనాలు మెల్లగా కదలసాగాయి. కాస్త సందు చిక్కగానే మా వీరాభిమన్యుడు పద్మవ్యూహంలోకి జొరబడ్డాడు. తిన్నగా వెళ్ళి సికింద్రాబాద్ గూడ్స్ షెడ్ పక్కనున్న ఒలిఫెంట్ బ్రిడ్జి దాటుకుని. ఎడంవేపుకి తిరగబోతుంటె. "అలా కాదు తిన్నగా పోనీ! కీస్ హైస్కూలు వద్ద ఆపు!" అన్నాను.

ఆటో తిన్నగా వెళ్ళి కీస్ హైస్కూల్ ముందు ఆగింది. గొడుగుని జాగ్రత్తగా పట్టుకుని ఆటోదిగి మీటర్ కేసి చూశాను. నాలుగూ చిల్లరైంది. ఆర్రూపాయలు వాడి చేతబెట్టి ముందుకి కదిలాను. ఎదురుగా బయలుదేరడానికి సిద్ధంగావుంది మల్కాజ్‌గిరి బస్సు!

ఒక్క అంగలో బస్సెక్కి సీటుమీద కూలబడి చేతనున్న గొడుగుకేసి ఆప్యాయంగా చూసుకుని "ఇప్పుడు దీని ఖరీదెంత?" అని ప్రశ్నించుకున్నాను.

'నాకూ అంజిగాడికీ కలిసి సుల్తాన్ బజార్ వెళ్ళడానికి బస్‌ఫేర్ ఒక్క రూపాయి. సుల్తాన్ బజార్లో గొడుగు ఖరీదు యిరవయ్యొక్కటి. నా హోటలు ఖర్చు రెండు రూపాయలు. చిక్కడపల్లిలో గొడుగు ఖరీదు ఇరవైనాలుగు. ఆటో కిరాయి ఆర్రూపాయలు. వెరసి యాభై నాలుగు రూపాయలు.' అని తేలింది.

ఇప్పుడుచెప్పండి! నేన్నిజంచెబితే నన్నెవరైనా హర్షిస్తారా? హర్షించకపోగా సీతాపతి కంటే చవటగా, ఎందుకూ కొరగాని దద్దమ్మగా జమకడతారు! అవునంటారా? కాదంటారా? అందుచేత నేనీ మధ్య కొత్తగా నేర్చుకున్న నీతి ఏమిటంటే— అత్యవసరమైతే తప్ప నిజం చెప్పకు— అనేది.

నెరసిన జుట్టు
రంగులపిల్ల కాదు. మా 'కేశరంజని' ఆయుర్వేదిక్ హెయిర్ ఆయిల్ నెరసిన జుట్టుకు మామూలు నల్లరంగు నిస్తుంది. పైగా అది మెదడుకు, కళ్ళకు మంచి టానిక్కు. ధర రు. 12/— సంతృప్తి, శాశ్వత ఫలితాలకి 3 ఫియల్స్ రు. 27/—.
SHYAM AYURVED BHAVAN
P.O. KATRI SARAI (GAYA)